# సెలవు మీద పొమ్మన్నారండి'



**వరదరాజులు** గత నలభై రోజులుగా శెలవు మీ దున్నాడు.

చాలామంది అతి ముఖ్యమైన పనులు పూర్తి చేసుకోవటానికి శెలవు పెడతారు. ఇళ్ళు కట్టేవాళ్ళు, పెళ్ళిళ్ళు చే సేవాళ్ళు— చేసుకునేవాళ్ళు ఇచ్చిన అప్పుల్ని వసూలు చేసుకునే వాళ్ళు, కొత్త అప్పు లే సేవాళ్ళు... కొన్ని కొన్ని ఆఫీసుల్లో రెక్కలమ్ముకున్నట్లు శెలవుకూడా అమ్మేసుకుంటారు.

కాని, వరదరాజులు పనే సే ఆఫీసు అన్నిటికన్నా భిన్నమైంది. అక్కడ మేధావుల సంఖ్య ఎక్కువ. శెలవే కాకుండా వీలైతే ఆఫీసు బిల్డింగ్నే అమ్మ గలిగే సమర్థు లున్నారు. కాని, ఆ నదుపాయమే లేదు.

వరదరాజులు బద్ధకస్తుడు. ఆఫీసులోనే పన్తెయ్యడు. ఇంకా శెలవు పెట్టి ఏం చేస్తాడు? అందు చేత అతగాడి శెలవు ఎకౌంటు పొంగి పొర్లిపోసాగింది. వరదరాజులికి ఆ విషయంకూడా తెలీదు— నీలకంఠం గారు పిలిచేదాకా.

నీలకంఠంగారు ఆ ఆఫీసుకి జాతీయ పతాకం లాంటివారు. ఆయ న్నందరూ గౌరవించి తీరాలి. అది రూలు. జాతీయ పతాకాన్ని అవమానపరి స్తే కారాగారం. నీలకంఠాన్ని అవమాన పరిచినా, ఆయన మాటని కాదన్నా స స్పెన్షన్, ఇంక్రిమెంట్లు స్టాపు, డిప్రొమోషన్లు, దూర ప్రాంతాలకి బదిలీలు తప్పవ్. అది ఆయన గొప్ప కాదు. ఆయన పన్లే సే సీటు అలాంటిది... ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు! గుండెకుండే గుమ్మం లాంటివారు. ఆఫీసుకి గుండె లాంటి జీయమ్‌కి కవాటం లాంటి నీలకంఠంగారి ముందు అందరూ భయ భక్తులతో కవాతు చేయాల్సిందే— తప్పదు.

అలాంటి నీలకంఠంగారు ఒకనాడు వరదరాజుల్ని కబురెట్టి పిలిపించారు.

కారణం మాత్రం ఎవ్వరికీ బోధపడింది కాదు. ప్రమోషనా? సస్పెన్షనా? ఇంక్రిమెంట్లు నిలుపుదలా, ట్రాన్స్ఫరా? ఏవిటి...ఏవిటి... ఎందుకెందుకు?

వరదరాజులు బితుకు బితుకుమంటూ గుహ లాంటి ఆయన గదిలోకి కాలు పెట్టాడు.

నీలకంఠంగారు కూర్చున్న కుర్చీలో పవరుంది కాని, ఆయన ఒంట్లో మాత్రం పీస మెత్తు పోపికుండదు. ఎండ కెండి, వానకి తడి ీసి వెలి ీసిపోయిన జెండా లాగా తెల్లగా ఎనిమిక్కుగా అపుపిస్తారు. ఎండిపోయిన పిల్ల కాలవ లాంటి తెల్లటి మొహం, నల్లటి బూర్లె మూ కుడు నెత్తిన బోర్లించినట్టుండే క్రాపు, చిలక పీకినట్టుండే చిన్ని ముక్కు, తెలుపు నలుపు కళ్ళే తరంగు ఫ్రెంచి కట్టు మీసం కింద సరిహద్దు గీతలాగా చిన్ని నోరు... వెర సి నీలకంఠం అనే ఐరన్ మాన్ ఆఫ్ది ఆఫీ సు.

వరదరాజులు లోనికెళ్ళేసరికి ఆయన పవ్వర్ చేస్తున్న సింహం లాగా తాపీగా, హుందాగా ఎవరి మీదనో రిపోర్టు తయారు చేస్తున్నారు. అతడ్ని కూర్చోమన్నట్టుగా తలాడించారు.

వరదరాజులు కూర్చున్నాడు.

కా స్సేపటికి తలెత్తి, 'మీరు నలభై రోజులు శెలవులో వెళుతున్నారు' అన్నారు సూటిగా చూస్తూ, వంకరగా నవ్వుతూను.

వరదరాజులికి ఆ మాట విన్నాక రెండు ధర్మ సందేహాలు కలిగినాయ్. అవి ఒకటి: అది ఆర్డరా, రిక్వెస్టా; రెండు: ఇంతమంది ఆఫీసులో ఉండగా

శంకరమంచి పార్థసారథి

తననే ఎందుకు పిలిపించినట్లు.

ఏదీ అడిగే ధైర్యం లేదు కనక- 'అంటే...' అంటూ నసిగాడు.

ఆయన ముందున్న ఫైలుని మూసి పక్కనున్న ట్రేలోకి విసిరేస్తూ, 'మీకు శెలవు చాలా ఉంది. అందుచేత కొన్నాళ్ళు శెలవులో పోవాల్సి ఉంటుంది' అన్నారు మళ్ళీ.

చివరికి దాచుకున్న శెలవుక్కూడా రక్షణ లేకుండా పోయిందీ దేశంలో అనుకుని, 'ఎందుకండి ?' అనడిగాడు కాస్త ధైర్యంగా.

'అనుకోకుండా సెంట్రలాఫీసు నుంచి అర డజను మంది— మీ కేడరువాళ్ళే— వచ్చి తలపై కూర్చున్నారు. వాళ్ళ నిక్కడ ఎడ్జస్టు చెయ్యాలంటే లీవు రిజర్వు ఆపరేట్ చెయ్యాలి... అందుకు.'

'కాని, నాకు లీవు వేస్టు కదండి' అన్నాడు కాస్త చనువుగా.

నీలకంఠంగారికి చనువు తీసుకునే వాళ్ళన్నా, తీసుకోవాలని ప్రయత్నం చేసేవాళ్ళన్నా, సరసాలాడే వాళ్ళన్నా, ఆడాలని అర్రులు చాచేవాళ్ళన్నా గిట్టదు— భార్యనుంచి బంట్రోతు దాకా ఒకటే రూలు!

'అదంతా నా కేం తెలీదు. ఇవి జీ యమ్‌గారి ఆర్డర్సు. ఈ విషయంలో అభ్యంతరాలుంటే వెళ్ళి ఆయన్తోనే మాట్లాడండి' అన్నారు విసుగ్గా, కోపంగా.

వరదరాజులు ఒకే ఒక్క క్షణం ఆలోచించాడు. జీయమ్ పందు కోతి. ఎప్పుడు చూసినా కల్లు తాగి నిప్పులపైని నడుస్తున్నట్లు అదోలా ఉంటాడు. వెళ్ళినా ఉపయోగం ఉండదు.

'సరే. అలాగే!' అని లేచి బయటికి వచ్చిన క్షణంనుంచి వరదరాజులు శెలవు మొదలైంది.

పనులు లేని వాళ్ళకి శెలవు మించిన శిక్ష లేదు. వరదరాజులికి జైలు శిక్ష ననుభవిస్తున్నట్టుగా ఉంది. అన్తమానం ఇంట్లోనే కాళ్ళు కాలిన పిల్లిలాగా తిరిగేవాడు. ఉన్న ఒక్క పిల్ల వెధవ స్కూలు కెళ్ళిపోగానే భార్య గజలక్ష్మి ఇంత తిని, ఏ వారపత్రికో పుచ్చుకుని మంచ మెక్కేది.

వరదరాజులికి నవలలు, పత్రికలు చదివే గుణం గాని, చదివే వాళ్ళపైని సదభిప్రాయం గాని లేవు.

అందుచేత భార్య మంచం పై కెళ్ళగానే అతగాడు దినపత్రికతో వాలు కుర్చీలో పీలుగా కూర్చునేవాడు. కూర్చుని దాన్ని 'సంపుటి సంచిక' దగ్గర్నించి 'ప్రింటెడ్ అండ్ పబ్లిష్డు' వరకు క్షుణ్ణంగా చదివేసే వాడు. కాస్సేపు రేడియో కబుర్లు, సాయంకాలం కాస్సేపు ఈవినింగ్ వాకింగ్, ఇంటికి రావడం, వాయిదాల పద్ధతిపై పుచ్చుకున్న టీ.వీ. ముందు చతికిల పడటం.

కోళ్ళ పెంపకం, కుక్కల పరిశుభ్రత గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు— వీరికి తెగులు పుడితే ఏం చెయ్యాలో, పుట్టకపోతే ఏం చెయ్యాలో అక్కడ చెబుతుంటే బుద్ధిగా వినేవాడు. ఆ పైన వార్తలు, జాతీయ కార్యక్రమంకూడా చూసుకుని కాని, నిద్దట్లోకి జారేవాడు కాదు. తెల్లవారితే మళ్ళీ మొదలు.

జైలు శిక్ష ననుభవిస్తున్న రాజకీయ ఖైదీలా ఉన్నా డతను.

గజలక్ష్మి ఒకటి రెండు సార్లు భర్త నడిగింది శెలవు పెట్టటానికి కారణ మేమిటని.

'ఆఫీసు వాళ్ళే శెలవులో పంపించా'రని చెప్పాడు.

అప్పట్లో గజలక్ష్మికి అది పెద్ద విశేషంగా అనిపించింది కాదు కాని, అదే వీధిలో నాలుగిళ్ళ కవతలుంటున్న ఇంజనీరుగారింటిపైన ఏసీబీ వాళ్ళు దండెత్తటము, ఆ పైన ఇంజనీరుగార్ని శెలవు పైని పొమ్మనటం... ఆ విషయం సీతమ్మగారి ద్వారా గజలక్ష్మికి తెలీటంతో వరదరాజులికి అష్టమంలో శని ప్రవేశించాడు.

సీతమ్మగారు ఆ వీధికి న్యూస్ పేపరు లాంటిది. ఎక్కడెక్కడి వార్తలు ఆవిడ చెవిన పడతాయ్. వాటి నావిడ టెలిప్రింటర్ కన్నా వేగంగా అందరికి అంద జేస్తుంది. అసలు పత్రికల వాళ్ళుకూడా, రాజకీయ సంక్షోభాలు, మంత్రివర్గ పతనాలు లేక వార్తలకై మొహం వాచినప్పుడు సీతమ్మగారి దర్శనం చేసుకుంటారని ప్రచారముంది కాని, అది అప్రస్తుతం—

ప్రస్తుతం—

ఒక చల్లటి సాయంత్రం సీతమ్మగారు గజలక్ష్మికి చల్లగ్గా చెప్పింది— 'ఆ పిప్పళ్ళ బస్తా లాంటి ఇంజనీరు అంత కొంప ఎలా కట్టా డనుకున్నావ్? లంచాలు తింటాట్ట. మొన్న రాత్రికి రాత్రి పోలీసులొచ్చి పట్టుకున్నార్ట. తరవాత శెలవులో పొమ్మన్నార్ట' అని.

'అంటే, పిన్నిగారూ, ఆ విధంగా లంచాలు అవీ మేసే వాళ్ళని శెలవు పైకి పొమ్మంటారా?' అనడిగింది గజలక్ష్మి అమాయకంగా.

'అవునమ్మా అలా శెలవులో పంపించి, విచారణ జరిపించి ఆ పైన జైలుకో— ఇంటికో పంపిస్తారు' అని తెగేసి చెప్పింది సీతమ్మగారు.

వరదరాజులు శెలవులో పొమ్మన్నారని చెప్పిన సంగతి చటుక్కున గుర్తు కొచ్చింది. ఒళ్ళు జలదరించింది. భయం బాకులా గుండెల్లోకి దిగబడింది.

ఇంటి కొచ్చి టీ.వీ. చూస్తున్న వరదరాజుల్ని, 'ఏమండోయ్! ఆ దిక్కు మాలిన టీ.వీ. వదలి ఇలా రండి' అంది ఆదుర్దాగా.

'ఏమైందే... ఏమి టా కంగారు ?' అంటూ వచ్చి వడ్డాడు వరద.

'నిజంగా చెప్పండి. మిమ్మల్ని ఆఫీసు వాళ్ళు శెలవులో పంపించారా లేక మీకుగా మీరు అప్లై చేశారా ?' అంది అదురుతున్న గుండెల్ని అదిమి పుచ్చుకుని.

తన శెలవు గూర్చి గజం ఎందు కలా కంగారు పడుతోందో, గజం బద్దలాగా బిగ దీసుకుంటోందో అర్థంకాక, 'వాళ్ళే పంపించారు' అన్నారు తాపీగా.

గజలక్ష్మి నిలువునా నీళ్ళు కారిపోయి కుర్చీలో కూలబడింది. 'ఓరి దేవుడో! అందుకా అలా బయటక్కూడా వెళ్ళకుండా మొహం తప్పిస్తున్నారు' అంటూ ఆరున్నొక్కరా గం అందుకుంది.

వరదరాజులు అసలే అప్పటిదాకా టీవీ చూస్తున్నాడేమో— బుర్ర సగం పాడైంది కాస్తా గజలక్ష్మి ఏడుపుతో పూర్తిగా పాడైంది. 'ఏవి టా రాగాలు ఎవడో చచ్చినట్లు? అసలేమైంది!'

'ఇంకా ఏం కావాలండి... సీతమ్మగా రంతా చెప్పింది దేవుడో!'


'ఏవిటే— ఆ సీతమ్మ మళ్ళీ ఏం చెప్పిందే? విషయం చెప్పి ఆ పైన తాపీగా ఏడు.'

గజలక్ష్మి పమిట కొంగుతో కళ్ళు తుడుచుకుని ఏడుపు నాపుకుంటూ, 'ఏమండీ! కట్టుకున్న దాన్నే కదా... కనీసం మాట వరసకైనా గజం ఇలా జరిగిందని చెప్పారా. అంత బాధని, కష్టాన్ని ఒక్కళ్ళూ మింగేసి కూర్చున్నారా?'

వరదరాజులి కంతా అయోమయంగా ఉంది. బాధేమిటి? కష్ట మెవరికి? అసలు భార్య అకారణంగా ఎందు కిలా ఏడుస్తూందో అంతు బట్టలేదు. అధికారం, వ్యవధి ఉంటే విచారణ సంఘం వేసేవాడే కాని, ఆ రెండూ లేవు గనుక కోపం తెచ్చుక్కుంటూ— 'ఏడు పాపి ఆ సీతమ్మ ఏం చెప్పిందో చెబుతావా, చెవడా లెక్క తీయమంటావా ?' వరదరాజులు సార్థకనామధేయుడు— ఏ వొచ్చినా పట్టలేం.

'చూశారా... చూశారా ఎంత కోపం తెచ్చుకుంటున్నారో? మనస్సు బాగుండక పోతే కోపం వస్తుందని సీతమ్మగారు చెప్పింది లెండి.'

ఆ టీవీ వాళ్ళు కోళ్ళ పెంపకాలు, కుక్కల చర్మవ్యాధుల గురించి కాకుండా పెళ్ళాల పెంపకా



లనూ, పెళ్ళాన్ని సముదాయించటమూ ఎలాగో చెపితే బాగుండుననుకుంటూ— 'గజం! ఏవిటె ంది? ఎందుకలా అకారణంగా శోకిస్తున్నావ్' అన్నా డు. వరదరాజులికి కంగారెక్కువైతే వ్యవహారికం మర్చిపోతాడు.

'ఆ ఇంజనీరుగారు లంచాలు తిన్నారట్ట. మొన్న అర్ధరాత్రి పోలీసులొచ్చి ఇల్లంతా వెతికి కాగితాలు, డబ్బు పట్టు కెళ్ళార్ట. ఆఫీసువాళ్ళు ఆయన్ని శెలవులో పొమ్మన్నార్ట' అన్చెప్పి శ్రుతి పెంచింది.

వరదరాజులి కప్పటికీ బల్బు వెలిగింది కాదు.

'అయితే, నువ్వెందు కలా ఎవళ్ళో పోయినట్లు ఏడుస్తున్నావ్? అసలు వాడికి, నీకు...'

సీతమ్మగారి పుణ్యమాని అగ్ని ప్రవేశం అనివా ర్యం అయ్యేట్టుంది. గజలక్ష్మి టక్కున ఏడు పాపేసింది. 'ఛీ ఛీ. అవేం మాటలండీ. ఎన్నడూ లేదు.'

'మరెందుకే ?'

'మిమ్మల్నీ ఆఫీసు వాళ్ళు శెలవులో పొమ్మన్నా రని విని...'

సరిగ్గా అప్పుడే వరదరాజులికి కర్థమైంది ఎందు కేడుస్తోందో! పెద్దగా నవ్వాడు. పడీ పడీ నవ్వాడు.జుట్టు పీక్కుని నవ్వాడు.

గజలక్ష్మికి అతడి వాలకం మరింత భయం గొల్పింది. పెళ్ళయ్యాక అతడు పిచ్చిగా, వెర్రిగా నవ్వటం అదే ప్రథమం. అందుచేత బిత్తరపోయి అలా చూస్తుండిపోయింది.

భార్య అమాయకత్వాన్ని చూశాక వరదరాజులికి చిలిపి ఆలోచనొకటి తళుక్కుమంది.

తప్పు చేసిన వాడిలా తలొంచుకుని— 'అవు నే, గజం! ఎలా చెప్పాలాని నాలో నేనే మథన పడి చస్తున్నా. ఆఫీసులో కక్కుర్తిపడ్డ మాట వాస్తవం అందుకనే శెలవులో పొమ్మన్నారు' అన్నాడు, తగి నంత నాటకీయం అభినయిస్తూ.

'ఓరిదేవుడా! అనుకున్నంతా అయింది. సీత మ్మగారు చెప్పింది నిజమే నన్నమాట' అంటూ మళ్ళీ ఎత్తుకుంది. ఈసారి కాస్త గట్టిగా, అనుమ నం లేనట్టు నిర్భయంగా ఏడ్చేస్తోంది. ఆమె నావటం కష్టంలా తోచింది. పౌరాణీకాల నటుడి చేత సినిమా డ్యూయెట్టు పాడించినట్టుం దా ఏడుపు.

వరదరాజులు తప్పదని కలుగజేసుకుని- 'సరే -ఊరికనే అన్నా-అంతా ఒట్టిదే-సరేనా!' అన్నా గాని గజలక్ష్మికి నమ్మకం కుదిరి చావటం లేదు. కా సేపు అవునంటాడు, కా సేపు కాదంటాడు. కా సేపు పగలబడి నవ్వుతాడు-మరి కా సేపు బిగ దీసు క్కూర్చుంటాడు. ఎలా నమ్మేది? అన లే, మాట నమ్మాలి! ఇ దే లక్షణమో రేపు సీతమ్మగారి నడగాలనుకుంటూనే ఏడుస్తోంది.

భార్యకి ఏం చెప్పి, ఎలా చెప్పి ఓదార్చాలాని వరదరాజులు ఇంకా ఆలోచిస్తూండగానే, ఏడాది క్రితం డబ్బాలో పారేసిన కార్డు ముక్కలాగా రాఘవయ్యగారు ఒక తోలు పెట్టె, బెడ్డింగు పుచ్చు కుని వచ్చి గుమ్మంలో నిల్చున్నారు.

తండ్రిని చూడగానే గజలక్ష్మి ఏడుపు మర్చిపో యింది.

వరదరాజులికి ఏడవా లనిపించింది— మాచి బందోబస్తు లగేజీతో వచ్చిన మామగారిని చూశాక.

ఇవేవి పట్టించుకోనట్టు రాఘవయ్యగారు లోపలి కొచ్చి, లగేజీని కూతురి కందించి, 'ఏవిట మ్మా! అలా ఉన్నావ్? కళ్ళూ కూడా వాచినట్లున్నా యి' అన్నారు ప్రేమగా.

దానికి వరదరాజులు బదు లిచ్చాడు— 'ఏం లేదండి! రాత్రి మీ మీద పీడ కలొచ్చిందట. రాత్రి నుంచి ఇదే వరస. అక్కడికీ నే చెప్పాను. మీ నాన్న కేం ఢోకా ఉండదు-చిరాయువు అని- వింటే నా.'

రాఘవయ్యగారు ముసిముసిగా మీసాల చాటున నవ్వి, 'పిచ్చి తల్లీ! ఇక్కడ నువ్వింతగా బాధ పడుతున్నందువల్లనే కాబోలు నేను అనుకో కుండా, ఇంట్లో గూడా చెప్పకుండా గమ్మత్తుగా వచ్చేశాను.'

గజలక్ష్మి అయోమయంగా తండ్రి వంక చూసింది.

వరదరాజులు ఆలోచన్లో పడ్డాడు. అత్తగారితో అల్లరిపడి వచ్చాడా లేక మరదలికి పెళ్ళి చెయ్య లేక కాశీ పోతూ కనిపించి పోదామని వచ్చాడా అన్నది సందిగ్ధంగా ఉంది.

ఆయన మాత్రం తాపీగా చెప్పుకు పోతున్నారు- 'మన కర్థం కాని అతీత శక్తేదో ఉందయ్యా! లేకపోతే, మాఆఫీసు నాల్రోజుల్నాడు ఇన్ స్పెక్షన్ కి రావడం ఏమిటి, ఆయన వెడుతుంటే సాగనంప టానికి నేను స్టేషన్‌కి రావడం ఏవిటి చెప్పు!'

'వ స్తే ఏవైంది?' వరదరాజులు ఆసక్తిగా అడిగా డు.

'వచ్చానా? వచ్చిన వాణ్ణి ప్లాట్‌ఫారంపై నిలబ డి చావక ఎంతైనా ఆఫీసరు గదా స్చెప్పి బండి లోపలి కెక్కి ఆయన సామాన్లు సర్దుతున్నా. ఆయ నేమో ప్లాట్‌ఫారంపై నిలబడి వెర్రివెధవలా అరటి పళ్ళు ఆవు మేసినట్లు మేస్తున్నాడు. బండి ఎప్పుడు కూత పెట్టిందో నే విన్లేదు. వాడి కేమో చెవుడు—వినబడి చావదు. రైలు కదిలింది-అదేం రైలో మాయదారి రైలు కదలంగానే స్పీడందు కుంది. ఆయ నేమో అక్కడే ఉండిపోయేడు. ఆయన లగేజీతో పాటు నే వచ్చేశా.'

వరదరాజులు ఫెళ్ళున, భళ్ళున నవ్వాడు-

రాఘవయ్యగారు ఉలిక్కి పడ్డారు. అల్లుడి వంక ఆశ్చర్యంగా చూశారు.

'ఏవిటోయ్? అంత సంతోషంగా ఉన్నావ్? ప్రామోషన్ గాని వచ్చిందా' అన్నారు మాట మారు స్తున్న ధోరణిలో.

వెంటనే గజలక్ష్మి అందుకుంది- 'ప్రామోషనా... సరేలే—నలభై రోజుల్నుంచి అసలు ఆఫీసుకే వెళ్ళటం లేదు.'

'అదేం- శెలవు గాని పెట్టావేమోయ్.'

శెలవు పెట్టలేదు, శెలవుపై పంపించారు' అంది గజలక్ష్మి— అ రెండిటికి రాముడికి, రావణా సురుడికి మధ్య నున్నంత తేడా ఉన్నట్లు ధ్వని స్తూ.

వరదరాజులు భార్యని మందలించాలా, మామ గారికి బదులివ్వాలా... ఏది ముఖ్యం అని ఆలోచి స్తూండగానే, గజలక్ష్మి మళ్ళీ అంది. 'ఏవిటో, నాన్నా! పెళ్ళాన్నన్న మాటే గాని, ఒక్క విషయం గూడా చెప్పరు గదా! శెలవు మీద పంపించారని చెప్పారు. అదీ సీతమ్మగారు చెప్పాకే-కాని, కారణం చెప్పరు. చెబితేనే గదా తేలి సేది. అదిగో! అలా మునీశ్వరుడి లా కూర్చుంటారు। ఉన్నట్టు ండి ఫెళ్ళుమంటూ నవ్వుతారు. అంతలో చిరాకు. కాలు బయట పెడితే ఒట్టు. అక్కడేం చేశారో, ఏమో!


'నోరు మూ స్తావా, లేదా? వెధవ సొదా నువ్వూ ను-'అన్నాడు వరద.

రాఘవయ్యగారికి పిల్ల చెప్పిన ప్రతి మాట నిజమేనని రుజువై పోయింది. అలాగే వరదరాజు లు ఆఫీసులో వెధవ పన్చేశాడని కూడా నిశ్చ యించేసి-

'అది కాదోయ్. అలా అరి స్తే ఏవి టుప యోగం? అయిందేదో అయింది. బతకటానికి అన్నా కం చేస్తాం. అప్పుడప్పుడు ఎదురు తిరుగుతుంటా య్. అసలు నన్నెన్నిసార్లు శెలవుపైన పంపలేదు? నేను నీలాగా మీ అత్తగారి పైన విరుచుకు పడ్డానా!'

'నే నిప్పుడు అత్తగారినేం అన్లేదే?'

'అబ్బ! అత్తగారిని అన్నావని కాదయ్యా చెప్పే ది. ధైర్యంగా ఉండాలని. నా బోటి శ్రేయోభిలాషుల కన్నా ఉన్నదేదో, జరిగిందేదో చెప్పేసుకోవాలి. ఏదో ఒకటి చేద్దాం- ఏ మంత్రినో, సినిమావాణ్ణో పట్టుకు సర్దుబాటు. చేయిద్దాం. అంతేగాని-'



వరదరాజులికి పిచ్చి కోపంగా ఉంది. 'అసలు నా కేమైందని...'

'నీకేం కాలేదేయ్-కాని, ఉద్యోగం? దాన్ని చూసే గదా పిల్లనిచ్చింది. అంచేత జరిగిందేదో చెప్పు-నీ తండ్రి లాటి వాణ్ణి.'

ఇహ లాభం లేదని వరదరాజులు ఉన్నది ఉన్నట్టు, నీలకంఠం దగ్గర్నుంచి, రూల్సు, రెగ్యులేషన్సు, శెలవులు, ఎడ్జస్టుమెంట్లు అన్ని చెప్పాడు. చెప్పి- 'అందువల్ల ఇవ్వాళతో నా శెలవు పూర్తయింది. రేపట్నించి నా ఆఫీసుకు నే వెళ్ళి నా పని నే చూసుకుంటా' అంటూ ముగించాడు.


భర్త చెప్పిందంతా విన్నాక గూడా గజలక్ష్మికి అనుమానం ముల్లులాగా గుచ్చుకుంటూనే ఉంది. 'ఏమో, నాన్నా, నాకేవిటో భయంగా ఉంది. ఎలాగూ వచ్చావు కాబట్టి రెండ్రోజులుండి ఆయన పరిస్థితు లేమిటో కాస్త కనుక్కో' అంది.

'అలాగే నమ్మా! నాకూ కాస్త పనుంది. అన్ని పనులు సర్దుబాటు చేసుకునే వెడతా. సరేనా?' అంటూ ఆఫీసరుగారి పెట్టె తెరచి, లుంగీ బయటికి తీశారు.

** ** **

ఆ మర్నాడు వరదరాజులు ఆఫీసు కాస్త త్వరగానే వెళ్ళాడు. రాత్రి జరిగిన గందరగోళం చూశాక కాస్త భయం కూడా అనిపించింది. అందుచేత చాలా ఆత్రంగా వెళ్ళాడు. కాని, నీలకంఠంగారు వేరేలా సెల విచ్చారు.

'వరదరాజులూ! అయామ్ సారీ! ఇంకో ఫిఫ్టీన్ డేస్ శెలవు పొడిగించాల్సి ఉంటుంది.'



వరదరాజులు కన్ను మన్నాడు. 'పొడిగించనండి-ఛస్తే పొడిగించను. అయినా, ఆఫీసులో నే ఒక్కడినేనా? వేరే వాళ్ళని పంపండి. నే మాత్రం జాయినైపోతా.'

నీలకంఠంగారు వరదరాజులు వంక ఆప్యాయంగా చూశారు. తనే ముందు మేక పిల్లని చూసుకునే సింహం లాగా అతడి వంక నిశితంగా చూసి, 'వెళ్ళాలండి. వెళ్ళనంటే ఎలా? రూల్సు...'

'వ్వాట్ రూల్సు?బ్లడీ రూల్సు. అయినా రూల్సులో వరదరాజుల్ని మాత్రమే పంపమని వ్రాసుందా-నా ఇబ్బందులు నాకున్నాయ్, సారీ' అంటు పెళ్ళాన్ని, మామగార్ని స్మరించుకుంటూ.

నీలకంఠంగారు కోపాన్ని నవ్వుగా మారుసూ—'మీ రిలా మొండిగా ఉంటే జీయమ్మ గారికి చెప్పాల్సి ఉంటుంది.'

వరదరాజులి కోపం పతాక స్థాయికి చేరింది. 'మీరేం చెప్పనక్కరలేదు- నేనే స్వయంగా ఆయన్తో మట్లాడతాను' అంటూ ఆవేశంలో లేవబోయి నంతలో చేతిలో ఉన్న పేపరు వెయిట్ జారి అక్కడి టేబిలు పైనున్న గాజు పలకపై పడటం, అవి ముక్కలు ముక్కలుగా పగలటం, కొన్ని ముక్కలు నీలకంఠంగారి ఒళ్ళోకి, మరి కొన్ని గది నేల నలువైపులకి తుపాకీ గుళ్ళులా దూసుకు పోయినాయ్-

నీలకంఠంగారి మొహం జేవురించింది. ఒంట్లో ప్రెషర్ పెరిగింది. కళ్ళజోడు ముక్కుపైకి జారింది. 'దిస్ ఇజ్ టూ మచ్' అనుకుంటూ ఆ గదిలోంచి ప్రక్కనున్న జీయమ్మ గదిలోకి వెళ్ళారు-

అరగంట తరవాత—వరదరాజులికి పిలుపొచ్చింది. జీయమ్మ గదిలో కెళ్ళాడు.

దౌర్జన్యంగా ప్రవర్తించాడని, అసభ్యంగా మట్లాడాడని, కావాలనే గాజుపలక పగలగొట్టాడని నీలకంఠంగారూ-

కాదని వరదరాజులూ-

అందుచేత జీయమ్మగారు నిజా నిజాలు విచారించేందుకు ఒక ఎంక్వైరీ కమిటీని వేస్తున్నట్లు, అప్పటివరకు వరదరాజులు శెలవుపై పోవాలని ఆర్డర్సు పాస్ చేసేశారు.

అయిదు నిమిషాల్లో ఆర్డర్ చేతి కొచ్చింది...' 'వరదరాజులు వజ్ ఆస్క్‌డ్ టు గో ఆన్ లీవ్!'

*

## రసవద్ఘట్టాలు

## పైగర్ వరదాచార్యుల టోపీ ఉదంతం

సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు పైగర్ వరదాచార్యులవారి శిష్య లోకరు వారిని సమీపించి "అయ్యగారూ! తాము పెట్టుకుంటున్న ఆ టోపీ ఏమాత్రం తమకు సరిపోదు. దయచేసి దాన్ని తీసివేయండి. మరో మంచి టోపీ తెస్తా" అని విన్నవించుకున్నారు.

"ఇంతమాత్రానికే ద్రావిడ ప్రాణాయామం ఎందుకయ్యా? భలేవాడివి. ఈ తలపై దేవేంద్రుని మకుటం పెట్టినా ఇంతే. బ్రహ్మ సృష్టే అలా ఉన్నప్పుడు, ఈ టోపీ చేసిన తప్పేముంది? మరెవరో నాకు టోపీ వేసే ముందు, మనమే టోపీ వేసుకోవడం మంచిదికదా? ఉండనివ్వు" అంటూ ఉదాసీనంగా ఉండిపోయారు.

స్థూలకాయులైన 'పైగర్'గారి తలపై చాలీచాలని ఆ టోపీ చూపరులకు నవ్వు పుట్టించేది. ఈ విషయం వరదాచార్యుల వారికి కూడా తెలుసు. అయినా, పట్టించుకొనేవారు కారు. రసికులూ, హాస్యప్రియులూ అయిన 'పైగర్' తమను గురించి ఎగతాళిగా మట్లాడుతూ మిత్రులతో సదా ఆనందంతో కాలక్షేపం చేసేవారు. శిష్యులను రెచ్చగొట్టాలనే ఆ టోపీకి తలపై సుస్థిరత్వం కల్పించారు. గత్యంతరం లేక శిష్యులు పైగర్‌గారికి ఆప్తులైన సుప్రసిద్ధ వాగ్గేయకారులు మైసూర్ వాసుదేవాచార్యులను ఆశ్రయించారు. వాసుదేవాచార్యులపట్ల పైగర్‌గారి కెంతో గౌరవం ఉండేది. ఆచార్యులవారికీ కూడా పైగర్ తలపైని టోపీ వికారంగా ఉన్న విషయం తెలుసు. 'సమయం వస్తుంది. కాస్త వేచి ఉండండి' అంటూ శిష్యులకు హామీ ఇచ్చి పంపారు.

ఒక సాయంకాలం వాసుదేవాచార్యుల వారి ఇంటిలో సంగీత విద్వాంసుల సమావేశం ఏర్పాటైంది. వాసుదేవాచార్యులవారు కాంబోజి రాగాలాపనలలో మధ్యమ కాలంలో పాడుతున్నారు. పైగర్ టోపీధారియై విచ్చేసి"అన్నగారూ, నేనేం పాపం చేశాను? తమ సంగీతాన్ని వినే అవకాశం నాకు కల్పించండి" అని విన్నవించారు.

"అద్భుతంగా ఉంది. తమ దివ్య గానానికి ప్రతిఫలంగా నే నేమివ్వగలను?" అన్నారు శ్రీ పైగర్. ఇదే అదను అనుకొన్న ఆచార్యులవారు "నేనేం కోరినా ఇవ్వవలె" అన్నారు.

"తప్పకుండా- ఏం కావాలో చెప్పండి" అన్నారు.

"దయచేసి మీ టోపీని అనుగ్రహించండి" అన్నారు వాసుదేవాచార్యులు.

మిత్రులు, శిష్యులు నవ్వుల కెరటాల్లో తేలుతున్నారు. విముక్తి చెందిన ఆ టోపీ కూడా గంతులేస్తూ కిందికి దూకి ఉంటుంది!

** ** **

వాసుదేవాచార్యులవారు మద్రాసు వెళ్ళినప్పుడల్లా 'సంగీత కళానిధి' టి. వి. సుబ్బరావుగారి ఇంటికి వెళ్ళేవారు.

ఒక సాయంత్రం మహా విద్వాంసులు పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, మహా వైద్యనాథ అయ్యర్ తిరుక్కొడి కావల్, పైగర్ వరదాచార్య మున్నగువారు సుబ్బరావు గారి ఇంట్లో సమావేశమయ్యారు. సుబ్బరావుగారి కోరికపై వాసుదేవాచార్యులవారు అక్కడ ఉన్న ప్రముఖుల సంగీత శైలిని అనుకరిస్తూ గానం చేశారు. చివర పైగర్‌గారిని అనుకరిస్తూ లోలోన ఆనందిస్తూ గానం చేశారు వాసుదేవాచార్యులు. శ్రీ పైగర్ అమాంతంగా నిల్చుని, చంకలో తలగడ, చాప చుట్టతో "సుబ్బరావుగారూ, నా కింక మద్రాసులో స్థానం లేదు. నా సర్వస్వాన్నీ ఈ దొంగ దోచుకున్నాడు! మరెక్కడైనా బ్రతుకుతెరువు చూసుకుంటాను" అంటూ నెత్తిన కండువా వేసుకున్నారు. అందరూ పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకున్నారు.

వాసుదేవాచార్యులవారు "అన్న గారూ, క్షమించండి. కేవలం వినోదంకోసం మిమ్ములను అనుకరించ యత్నించాను. అంతే" అన్నారు. పైగర్ సంతోషంతో మరికొంత సేపు పట్టుబట్టి పాడించుకొని వాసుదేవాచార్యులవారిని కౌగలించుకున్నారు. హృదయ సంపన్నుల లక్షణమది.

-జానమద్ది హనుమచ్ఛాస్త్రి